


నేటి పత్రిక

# ప్రజా వార్త

NETI PATRIKA PRAJA VARTHA

తెలుగు వారపత్రిక



TELUGU ONLINE DIGITAL NEWS PORTAL & ONLINE CHANEL

Prajavatha-Online Telugu News

http://www.prajavartha.com

వీక్షించండి.. చదవండి... చెప్పండి...



విజయవాడ | తేదీ: 1 - 7 జూలై 2023 | ఎడిటర్ : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి : 2 | సంచిక : 55 | పేజీలు : 4, వెల: రూ.5


## చిత్తూరు డెయిరీ పునరుద్ధరణకు

# సీఎం జగన్ శ్రీకారం

**తిరుపతి, నేటి పత్రిక ప్రజావార్త :**

రెండు దశాబ్దాలుగా మూతబడ్డ చిత్తూరు డెయిరీకి జీవం పోస్తూ అమూల్ సంస్థ రూ.385 కోట్ల పెట్టబడితో చేపట్టనున్న పునరుద్ధరణ పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం చిత్తూరులో భూమి పూజ చేశారు. అనంతరం చిత్తూరు సమీపంలోని చీలాపల్లి సీఎంసీ మెడికల్ కళాశాల, 300 పడకల ఆస్పత్రి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు పోలీసు పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ ఈరోజు జరుగుతున్న రెండు మంచి కార్యక్రమాల్లో మొదటిది.. ఏనాడో మూతపడ్డ అతి పెద్దదైన చిత్తూరు డెయిరీని తెరిపించేందుకు నాంది పలుకుతున్నాం. ఇక రెండోది.. దేశంలోనే టాప్ 3 మెడికల్ కాలేజీలలో ఒకటైన వేలూరు సీఎంసీ ఏర్పాటుకు పునాది రాయి వేస్తున్నాం. దివంగత వైఎస్సార్ ఏనాడో స్థలాన్ని కేటాయించి ఇక్కడ మెడికల్ కాలేజీని తీసుకొచ్చే కలగన్నారు. వైఎస్సార్ మరణం తర్వాత నిర్లక్ష్యానికి గురైన మెడికల్ కాలేజీ నిర్మాణానికి 14 ఏళ్ల తరువాత ఆయన బిడ్డగా ఇవాళ పునాది రాయి వేస్తున్నా. 1945లో చిల్లింగ్ ప్లాంట్‌గా ఏర్పడిన చిత్తూరు డెయిరీ 1988లో రోజుకు ఏకంగా 2 లక్షల లీటర్ల సామర్థ్యంతో ప్రాసెసింగ్ చేస్తున్న పరిస్థితులు కనిపించేవి. 1988-1993 మధ్య రోజుకు సగటున 2.50 లక్షల నుంచి 3 లక్షల లీటర్ల ప్రాసెసింగ్ స్థాయికి చేరుకుంది. ఆ సమయంలో గత ప్రభుత్వం 1992లో తన సొంత డెయిరీ హెరిటేజ్ పురుడు పోసుకున్న తర్వాత ఒక పద్ధతి, పథకం ప్రకారం చిత్తూరు డెయిరీని నష్టాల్లోకి నెట్టేస్తూ పోయారు. సహకార రంగంలోని చిత్తూరు డెయిరీని 2002 ఆగస్టు 31న ఎలాంటి నోటీసు ఇవ్వకుండా మూత వేసే స్థాయికి తీసుకెళ్లారు. 20



ఏళ్లుగా మూతపడ్డ ఈ చిత్తూరు డెయిరీ దుస్థితి చూసి దానికి జీవం పోసి పాడి రైతన్నలకు, అక్కచెల్లెమ్మలకు తోడుగా ఉంటానని హామీ ఇచ్చా. మాట ప్రకారం రూ.182 కోట్ల బకాయిలు తీర్చి నేడు చిత్తూరు డెయిరీ తలుపులు తెరిచాం. ప్రపంచంలోనే అతిపెద్ద సహకార డెయిరీ అమూల్‌ను తేవటమే కాకుండా వారు ఇదే డెయిరీలో రూ.385 కోట్లు పెట్టుబడి పెడుతున్నారని సంతోషంగా చెబుతున్నాం. ప్రతి ఆర్నెళ్లకు ఒకసారి డెయిరీకి పాలు పోసే అక్కచెల్లెమ్మలకు లాభాలను బోనస్‌గా పంచిపెట్టే గొప్ప కార్యక్రమానికి



శ్రీకారం చుడుతున్నాం. రూ.150 కోట్లతో చిత్తూరు డెయిరీ తొలిదశ పనులు మొదలవుతున్నాయి. దాదాపు లక్ష లీటర్లతో మరో 10 నెలల వ్యవధిలో పాల ప్రాసెసింగ్ మొదలవుతుంది. 2 లక్షల మందికి అమూల్ రాకతో అవుట్‌లెట్స్, డిస్ట్రిబ్యూషన్ చానెళ్ల ద్వారా పరోక్షంగా ఉపాధి దొరుకుతుంది. చంద్రబాబు, దత్తపుత్రుడు నాన్ రెసిడెంట్ నాయకులు. సంక్షేమ పథకాలు ఇస్తామంటే దాన్నీ అడ్డుకొనే కార్యక్రమం చేస్తారు. వీరికి అధికారం కావాల్సింది ప్రజలకు మంచి చేయడం కోసం కాదు... దోపిడీ కోసమే! ఈరోజు యుద్ధం జరుగుతోంది జగన్‌తో కాదు. పేదవాడితో పెత్తందార్లకు యుద్ధం జరుగుతోంది. మీ ఇంట్లో మంచి జరిగితే మీ బిడ్డకు మీరే సైనికులుగా నిలవాలని కోరుతున్నా అని అన్నారు.

పాడి రైతులకు మరింత మేలు చేసే విధంగా అధిక ధరకు పాల సేకరణ చేస్తామని పాడి రైతన్నలకు లాభం చేకూరుస్తామని జైన్ మెహతా, అమూల్ ఎండీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీ చరణ్, ఆర్‌కే రోజా, సీదిరి అప్పలరాజు, విడదల రజని, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, వెంకటేగౌడ, ద్వారక నాథరెడ్డి, ఎంఎస్ బాబు, నవాజ్‌బాషా.. ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, చిత్తూరు మేయర్ అముద, ఆర్టీసీ వైస్‌చైర్మన్ విజయానందరెడ్డి, జిల్లా కలెక్టర్ షణ్మోహన్, డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ, అమూల్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రశాంతి నిలయంలోని సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోడీ





**పుట్టపర్తి (శ్రీ సత్యసాయి జిల్లా), నేటి పత్రిక ప్రజావార్త :**

న్యూఢిల్లీ నుంచి మంగళవారం పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌ను వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బటన్ నొక్కి భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారు. అనంతరం సాయిరాం అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఏ ఆలోచన అయినా మానవతా విలువలతో కూడిన కార్యాచరణ సాగించినప్పుడు అత్యంత ప్రభావితంగా ఉంటుందని ప్రధాన మంత్రి అన్నారు. సత్యసాయిబాబా మానవాళికి ఎన్నో సేవా కార్యక్రమాలు అందించారని, ఆయన చూపిన మార్గం సత్యధర్మ, శాంతి, అహింసలతో, మానవతా విలువలతో తన సందేశాల ద్వారా ఎంతోమందికి స్ఫూర్తిదాయకమయ్యారన్నారు. ఈరోజు సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ అంకితం కాకుండా, శ్రీ సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ లీడర్స్ కాన్ఫరెన్స్ కూడా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం యొక్క ఇతివృత్తం - 'ఆచరణ మరియు ప్రేరేపణ'ను ప్రధాన మంత్రి ప్రశంసించారు. మరియు ఇది ప్రభావవంతంగా మరియు సంబంధితంగా పేర్కొన్నారు. సమాజం వారిని అనుసరిస్తున్నందున సమాజ నాయకులు మంచి ప్రవర్తన యొక్క ప్రాముఖ్యతను శ్రీ మోదీ నొక్కి చెప్పారు. అందుకు శ్రీ సత్యసాయి జీవితమే ప్రత్యక్ష ఉదాహరణ అని అన్నారు. "ఈ రోజు భారతదేశం కూడా తన విధులకు ప్రాధాన్యతనిస్తూ కదులుతోంది. స్వాతంత్ర్య శతాబ్ది దిశగా పయనిస్తూ అమృత్‌కాల్‌కి 'కర్తవ్య కాల' అని పేరు పెట్టాం. ఈ ప్రతిజ్ఞలలో మన ఆధ్యాత్మిక విలువల మార్గదర్శకత్వం అలాగే భవిష్యత్తు కోసం తీర్మానాలు ఉంటాయి. దీనికి వికాస్ (అభివృద్ధి) అలాగే విరాసత్ (వారసత్వం) రెండూ ఉన్నాయి. అయితే ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కలిగిన ప్రదేశాలకు పునర్వైభవం ఉందని, భారతదేశం కూడా సాంకేతికత మరియు ఆర్థిక వ్యవస్థలో అగ్రగామిగా ఉందన్నారు. ప్రపంచంలో మూడవ అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు మద్దతునిచ్చే ప్రపంచంలోని టాప్ 5 ఆర్థిక వ్యవస్థలలో భారతదేశం ఇప్పుడు ఒకటిగా మారిందని ప్రధాన మంత్రి నొక్కిచెప్పారు. డిజిటల్ టెక్నాలజీ, 5జీ వంటి రంగాల్లో ప్రపంచంలోని అగ్రగామి దేశాలతో భారత్ పోటీ పడుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలో జరుగుతున్న రియల్ టైమ్ ఆన్‌లైన్ లావాదేవీలలో 40 శాతం భారతదేశంలోనే జరుగుతున్నాయని, పుట్టపర్తి జిల్లా మొత్తాన్ని డిజిటల్ ఎకానమీ దిశగా మార్చాలని భక్తులను ప్రధాని కోరారు. ఈ తీర్మానాన్ని నెరవేర్చేందుకు అందరూ కలసి వస్తే వచ్చే శ్రీ సత్యసాయిబాబా జయంతి నాటికి జిల్లా మొత్తాన్ని డిజిటల్‌గా మారుస్తామని ఆయన సూచించారు. రాష్ట్ర గవర్నర్ ప్రశాంతి నిలయంలోని భగవాన్ శ్రీ సత్యసాయిబాబా మహాసమాధిని సందర్శించి నివాళులు అర్పించారు. అంతకుముందు ప్రశాంతి నిలయంలో ఉన్న శాంతిభవన్లో రాష్ట్ర గవర్నర్‌ని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ టీఎస్.చేతన్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి నంది విగ్రహాన్ని అందజేశారు. ప్రశాంతి నిలయంలో గౌరవ మర్యాదపూర్వకంగా పోలీసుల వందనం గవర్నర్ స్వీకరించారు అనంతరం రోడ్డు మార్గం ద్వారా బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు.

పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ నుంచి ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్, శ్రీ సత్యసాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైయర్ లర్నింగ్ ఛాన్సలర్ కే.చక్రవర్తి, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీలు రహైకో హీర, ఎస్ఎస్. నాగానంద్ వి.మోహన్, శ్రీ సత్యసాయి సేవ ఆర్గనైజేషన్స్ ఆల్ ఇండియా ప్రెసిడెంట్ నిమిష్ పాండ్యా, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీలంకలో వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించండి



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

గుంటూరు జిల్లా తాడేపల్లి లోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిను శ్రీలంక ఈస్టర్న్ ప్రావిన్స్ గవర్నర్ సెంథిల్ తొండమాన్, శ్రీలంక డిప్యూటీ హై కమిషనర్ డాక్టర్ డి వెంకటేశ్వరన్, ఇతర అధికారులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీలంకలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించాలని శ్రీలంక ప్రతినిధులు కోరగా సీఎం జగన్ సానుకూలంగా స్పందించారు.

శ్రీలంక నుంచి భారత దేశానికి వచ్చే భక్తుల్లో 50 శాతం మంది తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి వస్తారని, వారి ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు గురించి విన్నామని శ్రీలంక ప్రతినిధులు తెలిపారు. ఏపీలో జరుగుతున్న అభివృద్ధి గురించి విన్న తర్వాత సీఎం వైయస్.జగన్‌ను వ్యక్తిగతంగా కలిసి ఆహ్వానించాలన్న తమ అధ్యక్షుడు ఆదేశాల మేరకు ముఖ్యమంత్రిని కలిసినట్లు శ్రీలంక ప్రతినిధులు తెలిపారు. వ్యవసాయ, పారిశ్రామిక, పర్యాటక రంగాల్లో ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని శ్రీలంక ఈస్టర్న్ ప్రావిన్స్ గవర్నర్ సెంథిల్ తొండమాన్, శ్రీలంక డిప్యూటీ హైకమిషనర్ వెంకటేశ్వరన్‌లు అన్నారు.

## అంబేడ్కర్ స్మృతి వనం పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేస్తున్నాం

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

రాష్ట్రం నడిబొడ్డున భారతదేశం గర్వించదగ్గ స్మృతుల్లో ఒకరైన అంబేడ్కర్‌కు ఘన నివాళిగా 20 ఎకరాల్లో స్మృతివనం, దేశంలోనే అతిపెద్దదైన అంబేడ్కర్ విగ్రహం పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. అంబేడ్కర్ స్మృతివనం పనులను సజ్జల రామకృష్ణారెడ్డి, సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి, విగ్రహ నిర్మాణ కమిటీ చైర్మన్ మేరుగు నాగార్జున తదితరులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారతదేశంలో సమానత్వ దిశగా వడివడిగా అడుగులు వేయటానికి కారణం అంబేడ్కర్ అని కొనియాడారు. దేశంలోనే అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఈ ఏడాది అంబేడ్కర్ స్మృతి వనం పనులు పూర్తి చేసి దేశానికి, రాష్ట్రానికి అంకితం చేయనున్నామన్నారు. అంబేడ్కర్ స్మృతి వనంలో అంతర్జాతీయ స్థాయి రిసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు.

దేశంలో, రాష్ట్రంలో అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహం అతి త్వరలోనే మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జాతికి అంకితం చేయనున్నాడని సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి, విగ్రహ నిర్మాణ కమిటీ చైర్మన్ మేరుగు నాగార్జున అన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం దేశంలోనే గొప్ప చారిత్రక కట్టడం కాబోతుందన్నారు. అంబేడ్కర్ అతిపెద్ద విగ్రహ ఏర్పాటుకు రూ.400 కోట్లకు పైగా ఖర్చుపెడుతున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఏ రక్షణ నిధి, ఎంఎల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎంపీ నందిగం సురేష్, సాంఘీక సంక్షేమ శాఖ



డైరక్టర్ విజయకృష్ణన్, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విద్యుదుత్పత్తిలో 'మాచ్‌ఖండ్' రికార్డు

**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

విద్యుత్ ఉత్పత్తిలో మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం రికార్డు నమోదు చేసింది. 2023 జూన్ నెలలో 91.48 శాతం ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్)తో 79.042 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసింది. ఇది గత 15 ఏళ్లలో ఒక నెలలో సాధించిన అత్యధిక ఉత్పత్తి కావడం గమనార్హం. ఒక్కడ మొత్తం ఆరు యూనిట్లు ఉండగా పరికరాలు దెబ్బతినడంవల్ల సుమారు రెండేళ్లపాటు పనిచేయకుండా మూలపడి ఉన్న రెండు యూనిట్లను మరమ్మతులు చేసి గత మే నెలలో అందుబాటులోకి తెచ్చారు. దీంతో మే నెల నుంచి ఆరు యూనిట్లు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తూ గత నెలలో ఈ రికార్డు ఉత్పత్తి సాధించాయి.

**అన్నీ శుభ పరిణామాలే...**

మాచ్‌ఖండ్ నదిపై 98 మెగావాట్ల సామర్థ్యంతో మరో మూడు జలవిద్యుత్ ప్రాజెక్టులను సంయుక్తంగా నిర్మించాలని 23-10-2020న ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదిరింది. దీనిని ఆచరణలో పెట్టే చర్యల్లో భాగంగా గత నెలలో భువనేశ్వర్‌లో రెండు రాష్ట్రాల ఇంధనశాఖ అధికారులు, ఒడిశాహైడ్రో పవర్ కార్పొరేషన్, ఏపీజెన్‌కో అధికారులు సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకోవడం, ఇప్పుడు అధిక ఉత్పత్తి సాధించడం శుభ పరిణామాలు.

**ప్రభుత్వ ప్రోత్సాహంతోనే :** ఏపీజన్‌కో ఎండీ చక్రధర్‌బాబు

ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మార్గదర్శకంలో ఇంధన, అటవీ, పర్యావరణం, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సహాయ సహకారాలవల్లే మాచ్‌ఖండ్‌లో అత్యధిక ఉత్పత్తి సాధ్యమైందని జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ చక్రధర్‌బాబు ప్రకటించారు. వేసవిలో అధిక విద్యుత్ డిమాండు ఉన్న సమయంలో అత్యధిక ఉత్పత్తికి నిరంతరం పాటుపడినందుకు జెన్‌కో ఉద్యోగులను, ముఖ్యంగా మాచ్‌ఖండ్ ప్రాజెక్టు సిబ్బందిని, అధికారులను ఆయన ప్రశంసించారు. 100 శాతం పీఎల్ఎఫ్ లక్ష్యంగా పనిచేయాలని ఉద్యోగులకు సూచించారు.

## విద్యార్థులకు ఉపయోగకారిగా సాంకేతిక విద్యాశాఖ స్నేహపూర్వక వెబ్‌సైట్

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

విద్యార్థులకు అన్ని విధాల సహాయకారిగా ఉండేలా సాంకేతిక విద్యాశాఖ నూతన వెబ్‌సైట్‌ను రూపకల్పన చేసామని ఆ శాఖ కమీషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. స్క్రీన్ రీడర్‌లను ఉపయోగించడం ద్వారా దృష్టిలోపం ఉన్న వ్యక్తులు సైతం చదవగలిగేలా ఈ నూతన వెబ్‌సైట్ కంటెంట్‌ను అందిస్తుందన్నారు. సాంకేతిక విద్యాశాఖ నూతనంగా రూపొందించిన స్నేహపూర్వక వెబ్‌సైట్‌ను సోమవారం మంగళగిరి కమీషనరేట్‌లో కమీషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ నూతన వెబ్ సైట్ ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాలిటెక్నిక్‌ల గురించిన మొత్తం సమాచారాన్ని సందర్శకులు, విద్యార్థులు యాక్సెస్ చేయగలుగుతారన్నారు. ఫీడ్‌బ్యాక్ వ్యవస్థను సైతం ఈ వెబ్‌సైట్ కలిగి ఉందని, సాధారణ పౌరుల మొదలు, విద్యార్థులు, సందర్శకులు వారి ఆలోచనలు, సూచనలు, ఫిర్యాదులు మొదలైనవాటిని ఇక్కడ నేరుగా పొందుపరచగలుగుతారన్నారు. వీటిని రానున్న కాలంలో వెబ్‌సైట్ అప్‌గ్రేడేషన్‌కు విలువైన ఇన్‌పుట్‌లుగా తీసుకుంటామన్నారు. స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, పాలిసెట్, ఇంజనీరింగ్ అడ్మిషన్‌లు, విద్యార్థుల బదిలీలు వంటి ఉపయోగకరమైన వెబ్‌సైట్ లింక్‌లు కూడా దీనిలో అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ సంయుక్త సంచాలకులు వెలగా పద్మారావు, ఉప సంచాలకులు డాక్టర్ ఎంఎ రామకృష్ణ, డాక్టర్ బి.కళ్యాణ్, రాష్ట్ర సాంకేతిక విద్యా, శిక్షణా మండలి కార్యదర్శి కెవి.రమణబాబు, సంయుక్త కార్యదర్శులు జానకిరామయ్య, సత్యనారాయణ, ఐటి సమన్వయకర్త డాక్టర్ కె.రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.



# నాణ్యమైన బియ్యంతో బడి పిల్లలకు భోజనం అందజేయాలి : గాంధీ నాగరాజన్



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

బడి పిల్లలకు పెట్టే మధ్యాహ్న భోజనం దారుణంగా ఉంటుందని నాణ్యమైన సన్నబియ్యంతో విద్యార్థులకు భోజనం పెట్టాలని గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు గాంధీ నాగరాజన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఊర్మిళానగర్‌లోని గాంధీ ట్రస్ట్ ఆశ్రమంలో గాంధీ నాగరాజన్ మహాత్మా గాంధీ హత్యకు గురైన 30వ తేదీని పురస్కరించుకొని ప్రతినెల 30వ తేదీన కళ్ళకు గంతలతో నిరాహార దీక్ష చేపట్టే కార్యక్రమంలో భాగంగా ఒక రోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గాంధీ నాగరాజన్ మాట్లాడుతూ బడి పిల్లలకు పెట్టే మధ్యాహ్న భోజనం దారుణంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు పెట్టే భోజనాన్ని మంత్రులు గాని, అధికారులు గానీ తినగలరా అంటూ ప్రశ్నించారు. నాణ్యమైన సన్నబియ్యంతో విద్యార్థులకు భోజనం పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆనాటి వరకు తాను కూడా రేషన్ బియ్యం తింటానని చెప్పారు. గతంలో తమిళనాడు ముఖ్యమంత్రి కామరాజ్ బడి పిల్లలకు పెట్టిన బియ్యంతోనే తాను కూడా భోజనం చేశారని, అటువంటి స్ఫూర్తి నేటి నాయకుల్లో కొరవడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఓట్లను కొనే వారికి ఓటేయకండని పిలుపునిచ్చారు. పనికి ఆహార పథకం దారి మళ్లుతోందని ఆ పనులు కూడా చిన్న పిల్లలతో చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలైన నాడే నిజమైన మహిళ సాధికారత లభించగలదని అన్నారు. వాస్తవానికి మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, ఆనాడే మహిళాభివృద్ధి సాధ్యమవుతుందని గాంధీ నాగరాజన్ కోరారు. నేడు ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, నిజమైన ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలంతా పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గాంధీ దేశం ట్రస్టు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బి.భారతి ఆశ్రమ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బిజేపి.. అంటే బాబు, జగన్, పవన్ : గిడుగు రుద్రరాజు




**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

బాబు, జగన్, పవన్ అంటే బిజేపికి నిర్వచనమని ఏపిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు వివరించారు. ఈ రోజు విజయవాడ ఆంధ్రరత్న భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ దేశంలో బిజేపిని ప్రజలు అసహించుకుంటున్నారు అని అన్నారు. వచ్చే ఎన్నికలలో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపడుతుందని రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అవుతారని అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రతి పక్ష నాయకులూ భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వం పతనం కాబోతుందని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతున్నదని తెలిపారు. మోడీ ప్రభుత్వం దేశంలోని ప్రభుత్వరంగ ఆస్తులను అమ్మేసి ప్రయివేటు వ్యక్తులకు అమ్మేస్తుందని దీనివల్ల నిరుద్యోగ సమస్య పెరిగిందని, కేంద్రంలోని బిజెపి. ప్రభుత్వాన్ని దేశ ప్రజలు నమ్మి మోసపోయారన్నారు. తాను చేసిన పాద యాత్ర 308 రోజులు దిగ్విజయంగా సాగింది అని ప్రజల సమస్యలు తెలుసుకున్నానని అన్నారు. ఈ పత్రిక విలేకరుల సమావేశంలో రుద్రరాజుతోపాటు భట్టి విక్రమార్క వర్కింగ్ ప్రెసిడెంట్లు మస్తాన్ వలి, సుంకర పద్మశ్రీ, ఎఐసిసి. సభ్యులు మేడ సురేష్, యువజన జాతీయ కాంగ్రెస్ కార్యదర్శి రక్ష రామయ్య, ఐ.వై.సి. మమతా నాగిరెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు పాల్గొన్నారు. అధ్యక్షులు రుద్రరాజు, భట్టి విక్రమార్కను శాలువాతో సన్మానించారు.

# ది విటిపియస్ అఫీసర్సు కన్స్యూమర్స్ కో ఆపరేటివ్ స్టోర్సు లిమిటెడ్ ఇబ్రహీంపట్నం పాలకవర్గ సభ్యుల ఎన్నిక

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

ది విటిపియస్ అఫీసర్సు కన్స్యూమర్స్ కో ఆపరేటివ్ స్టోర్సు లిమిటెడ్ ఇబ్రహీంపట్నం పాలకవర్గ సభ్యుల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని ఎన్నికల అధికారి అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి.సత్యనారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సహకార సంఘములు నిబంధనల మేరకు రహస్య బ్యాలట్ పద్ధతిపై ఎన్నికల ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందన్నారు. 11 పాలకవర్గ సభ్యులు ఎన్నికలకు సంబంధించి నామినేషన్ పత్రాలను ఈ నెల 7వ తేదీ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఇబ్రహీంపట్నం సంఘ కార్యాలయము నందు స్వీకరించడం జరుగుతుందన్నారు. నామినేషన్ పత్రముతో పాటు షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగలకు చెందిన అభ్యర్థులు రూ /-100 రుసుము, వెనుకబడిన తరగతులకు చెందిన వారు రూ /-200, ఇతరులు రూ /-400 చెల్లించవలసి ఉంటుందన్నారు. నామినేషను పత్రాల పరిశీలన 8వ తేదీ ఉదయం 10 గంటల నుండి జరుగుతుందన్నారు. నామినేషన్ పత్రాల ఉపసంహరణ 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని తుది అభ్యర్థుల జాబితా 9వ తేదీ సాయంత్రం 5 గంటల అనంతరం ప్రకటించడం జరుగుతుందన్నారు. ఈ నెల 16వ తేదీ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఏపియస్ ఈబి ఇంజనీర్స్ & ఏఈస్ అసోసియేషన్ హాల్, 'ఏ' కాలనీ గ్రౌండ్స్, విటిపియస్, ఇబ్రహీంపట్నం నందుపోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఓట్ల లెక్కింపు 16వ తేదీన పోలింగ్ పూర్తైన వెంటనే ఫలితాలను ప్రకటించడం జరుగుతుందన్నారు. పోటీ లేకపోతే 9వ తేదీ నామినేషన్ ఉపసంహరణ అనంతరం ఎన్నికైనట్లు ప్రకటిస్తామన్నారు. కార్యవర్గ సభ్యుల (ఆఫీసు బేరర్ల) ఎన్నికను పోటీ ఉంటే 17వ తేదీ ఉదయం 9 గంటలకు, పోటీ లేకపోతే 10వ తేదీ ఉదయం 9 గంటలకు నిర్వహిస్తామని ఎన్నికల అధికారి అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి.సత్యనారాయణరెడ్డి ఆ ప్రకటనలో తెలిపారు.

# నాటా తెలుగు మహా సభలనుద్దేశించి సీఎం జగన్ సందేశం



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

అమెరికాలోని డల్లాస్‌లో జరుగుతున్న నాటా తెలుగు మహా సభలనుద్దేశించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వీడియో ద్వారా తన సందేశం ఇచ్చారు. ముఖ్యమంత్రి సందేశాన్ని నాటా సభల్లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ... 2023 నాటా కన్వెన్షన్‌కు హాజరైన ప్రతి ఒక్కరికీ బెస్ట్ విషెస్ తెలియజేశారు. నాటా కార్యవర్గానికి ముఖ్యంగా శ్రీధర్, అనిల్, ప్రేమసాగర్‌తో పాటు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. నాలుగేళ్ళ కిందట తాను డల్లాస్ వచ్చిన సందర్భం ఇప్పటికీ గుర్తుందన్నారు. మీరంతా నా మీద చూపించిన ప్రేమ, అభిమానం, ఆప్యాయత ఎప్పటికీ మర్చిపోలేనని అన్నారు. 'వేరే దేశంలో ఉన్నా, ఇంత మంది తెలుగువారు. గొప్పవైన మన సంస్కృతి, సాంప్రదాయాల్ని కాపాడుకుంటూ చక్కటి ఐకమత్యాన్ని చాటటం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. మిమ్మల్ని అందరినీ ఒకసారి తల్చుకుంటే.. అక్కడ పెద్ద, పెద్ద కంపెనీలలో సీఈఓలుగా ఐటీ నిపుణులుగా, నాసా వంటి సంస్థల్లో కూడా సైంటిస్టులగానూ, అనేక విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లుగా, అమెరికా ప్రభుత్వంలో కూడా ఉద్యోగులుగా, బిజినెస్‌మెన్‌గా, మంచి డాక్టర్లుగా రాణిస్తున్న తీరుకు మిమ్మల్ని చూసి మేమంతా ఇక్కడ గర్వపడుతున్నాం. మీలో అనేకమంది మూలాలు.. మన గ్రామాల్లోనే కాకుండా మన మట్టిలో ఉన్నాయి. మీలో అనేకమంది పేద, మధ్యతరగతి కుటుంబాల్లో నుంచి వచ్చినా.. అక్కడకి వెళ్లి ఇలా రాణించడానికి.. మీ కఠోరమైన కమిట్‌మెంట్, ఫోకస్ ఈ రెండూ మిమ్మల్ని ఆ గడ్డ మీద నిలబెట్టాయి. నిజంగా మిమ్మల్ని చూసినప్పుడు ఆ స్ఫూర్తి మాలో ప్రతి ఒక్కరికీ వస్తుంది. అలాం కమిట్‌మెంట్, ఫోకస్ మన రాష్ట్రంలోని మన పిల్లల్లో ఎంతగానో ఉండటం నేను నా కళ్లారా చూశాను. ఆకాశమే హద్దుగా.. ఆకాశాన్ని దాటి వెళ్లాలన్న కోరికతో ఉన్న వారు ఎదగాలంటే, అందుకు వారికి కావాల్సిన సదుపాయాలు కల్పించాలన్న తపనతో ఈ నాలుగు సంవత్సరాల కాలంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తేగలిగాం. గ్లోబల్ సిటిజన్‌గా మనం ఎదగాలంటే.. చదువన్నది ఒక పెద్ద అవసరమైన సాధనం. అందుకనే రాష్ట్రంలో విద్యారంగంలో తెచ్చిన విప్లవాత్మ మార్పులు గమనించినట్లయితే.. మన గవర్నమెంట్ బడులన్నీ కూడా పూర్తిగా రూపురేఖలు మారుతున్నాయి. అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యా కానుక, ఉన్నత విద్యలో అయితే విద్యా దీవెన, వసతి దీవెన లాంటి పథకాలన్నీ కూడా ఏపీలో గొప్పగా అమలు చేస్తున్నాం. ఇవన్నీ చదువుకుంటున్న పిల్లల కోసం విద్యావ్యవస్థలో తెస్తున్న మార్పులు. చదువు అనే ఒక ఆయుధం ఎంత అవసరమో చెప్పడానికే ఇవన్నీ ఇంతగా చెప్పాల్సి వస్తుంది. విద్యారంగం ఒక్కటే కాదు... ఏ రంగాన్ని తీసుకున్నా ఇలాంటి మార్పులే కనిపిస్తాయి. మీ గ్రామంలో ఎప్పుడూ చూడని విధంగా విలేజ్ సెక్రెటేరియట్ మీ కళ్లెదుటనే కనిపిస్తుంది. ఒక వాలంటీర్.. పౌర సేవల్ని ఇంటింటికీ డోర్ డెలివరీ చేస్తున్నాడు. పెన్షన్, రేషన్.. అన్నీ మన ఇంటి ముంగిటికే వచ్చే గొప్ప వాతావరణం మన రాష్ట్రంలో కనిపిస్తుంది. ప్రతి గ్రామంలోనూ ఒక రైతు భరోసా కేంద్రం కనిపిస్తోంది. ఇవాళ ప్రివెంటివ్ కేర్‌లో ఎక్కడా చూడని విధంగా మన గ్రామంలోనే అడుగులు కనిపిస్తున్నాయి. ప్రతి గ్రామంలోనూ ఒక విలేజ్ క్లినిక్.. దానికి అనుసంధానంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను తీసుకునివచ్చాం. ఎప్పుడూ చూడని విధంగా టెర్షిరీ కేర్‌లో 17 కొత్త మెడికల్ కాలేజీలు తీసుకొచ్చాం. ఒక్క వైద్య రంగంలోనే 48వేల పోస్టులను భర్తీ చేశాం. ప్రతి గ్రామంలోనూ మరో నాలుగు అడుగులు వేస్తే ఇంగ్లీష్‌మీడియం బడులు కనిపిస్తాయి. వారికి కావాల్సినంత కంటెంట్ ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సంస్థలు మనకు ఇంటర్‌నెట్‌లో అందుబాటులోకి తీసుకువచ్చాయి. నేడు ఏపీలో పరిస్థితి ఎలా ఉందో గమనిస్తే.. రాష్ట్రంలో కనీవినీ మార్పులు కనిపిస్తున్నాయి. రూరల్ ఎకానమీ బలపడాలి. అలా జరగాలంటే ప్రతి గ్రామంలోనూ నివసిస్తున్న వాళ్ల ఆకాంక్షలను నెరవేర్చాలి. రాబోయే రోజుల్లో అన్‌లిమిటెడ్ బ్యాండ్ విడ్త్‌తో ఇంటర్నెట్ కనెక్టివిటీ ప్రతి గ్రామంలోకి వస్తుంది. అక్కడే డిజిటల్ లైబ్రరీ కూడా వస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామస్థాయిలో మన కళ్లెదుటనే జరుగుతున్న గొప్ప మార్పులివి. 4 పోర్టులు వేగంగా నిర్మాణం అవుతున్నాయి. విశాఖపట్టణం, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కూడా శంకుస్థాపన చేసుకున్నాం. 3 ఇండస్ట్రియల్ కారిడార్లు పనులు మన రాష్ట్రంలో జరుగుతున్నాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో వరసగా మూడు సంవత్సరాలు నుంచి దేశంలోనే మొదటి స్థానంలో ఆంధ్రరాష్ట్రమే కనిపిస్తోంది. ఇవన్నీ ఎందుకు నేను ఇంతగా చెప్పాల్సి వస్తుందంటే కారణం.. అక్కడ ఉన్న మీ సహాయ, సహకారాలు కూడా ఎంతో అవసరం అని చెప్పడానికే ఇవన్నీ మీ దృష్టికి తీసుకువస్తున్నాను. చివరిగా మీ అందరికీ ఒక్కటే విజ్ఞప్తి. అక్కడ మీరు ఎంతగానో ఎదిగారు. ఎన్నో సంవత్సరాల ఎక్స్‌పీరియన్స్, ఎక్స్‌పోజర్ మీకు ఉంది. ఆంధ్రరాష్ట్రానికి మీరు ఏ రకంగా ఉపయోగపడగలిగితే ఆ రకంగా ఉపయోగపడండి. ఆర్థికంగా అన్న మాటలు కాస్తా కూస్తో.. ఉపయోగకరంగా ఉంటాయి కానీ దాన్ని పక్కనపెడితే.. అంతకంటే ఎక్కువగా మీ అనుభవం అవసరం. ఇప్పటికే అభివృద్ధి చెందిన వెస్టర్న్ వరల్డ్‌లో మీరు ఇన్నేళ్లు అక్కడ ఉన్నారు కాబట్టి మీ అనుభవం మనకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అవన్నీ కూడా మీరు ఇంకా ఎక్కువగా ఏపీ మీద, మన గ్రామాల మీద ధ్యాస పెట్టగలిగితే మన రాష్ట్రానికి ఉపయోగపడతాయి. ఇది నా తరపు నుంచి మీకు చేస్తున్న విజ్ఞప్తి. ఈ సందర్భంగా నాటా కార్యక్రమంలో పాలుపంచుకొంటున్న మీ అందరికీ మంచి జరగాలని, అమెరికాలో ఉన్న తెలుగువాళ్లు అందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు, అభినందనలు' అని సీఎం తన సందేశం వినిపించారు.

# ఈ ఏడాది చివరి నాటికి జిల్లాలో 5 వేల టిడ్కో ఇళ్లను పంపిణీకి కార్యాచరణ



**రాజమహేంద్రవరం, నేటి పత్రిక ప్రజావార్త :**

పట్టణ ప్రాంతంలో ఇళ్లు లేని నిరుపేదల స్వంత ఇంటి కల సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ ఏడాది చివరి నాటికి రాష్ట్రంలో 2 లక్షల 62 వేల మందికి టిడ్కో ఇళ్ళ పంపిణీ చేయడం జరుగుతుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు .

సోమవారం రాజానగరం నియోజకవర్గం పరిధిలోని జిఎస్ఎల్ సమీపంలోని ప్రవేటు సమావేశ మందిరంలో జిల్లాకు చెందిన టిడ్కో పై హెూం మంత్రి తానేటి వనిత, జిల్లా కలెక్టర్ డా కే. మాధవీలత, టిడ్కో చైర్మన్ జే.ప్రసన్న కుమార్, ఎండి సిహెచ్. శ్రీధర్‌లతో కలిసి పురపాలక మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ, రాష్ట్రంలో పూరి గుడిసె లేకుండా అర్హులైన పేదలకు స్వంత ఇంటి కల సాకారం చేసే దిశలో ఒక్క రూపాయితో రిజిస్ట్రేషన్ చేసి టిడ్కో గృహాలను అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తన సుదీర్ఘ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీకి కట్టుబడి టిడ్కో కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర హెూం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ ఈ సమీక్షలో కొవ్వూరు పరిధిలోని టిడ్కో గృహాలపై సమీక్ష నిర్వహించామని, కేటగిరీ ఏ పరిధిలోని 240 ఇళ్లను ఒక్క రూపాయితో లబ్దిదారుల పేరున రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం జరుగుతుందని అన్నారు. టిడ్కో గృహ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి వనిత పేర్కొన్నారు.

ఈ సమీక్షా సమావేశంలో కొవ్వూరు పురపాలక సంఘం చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, వైస్ చైర్మన్‌లు మన్నే పద్మావతి, గండ్రోతు అంజలిదేవి, జిల్లా కలెక్టర్ డా కే.మాధవీలత, టిడ్కో చైర్మన్ జే.ప్రసన్నకుమార్, ఎండి సిహెచ్. శ్రీధర్, మునిసిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, టిడ్కో ఇంజనీర్లు పి.గోపాలకృష్ణారెడ్డి, బి.శ్రీనివాసరావు, ఎం ఎస్ స్వామినాయుడు, జి.నాగేశ్వరి, కొవ్వూరు మునిసిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు అవసరమైన ప్రతి పాదనలను రూపొందించాలి



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

ఆక్రమణలకు సంబంధించి ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు అవసరమైన ప్రతి పాదనలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం విజయవాడ పశ్చిమ, సెంట్రల్, తూర్పు నియోజకవర్గాలు, నగరపాలక సంస్థ పరిధిలోని రోడ్డు భవనాలు, జలవనరుల శాఖ, రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్ భూముల క్రమబద్ధీకరణపై జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు సమీక్షించారు. సమావేశంలో కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ప్రభుత్వ భూములలో నివాసం ఉంటున్న నివాసితులకు ప్రత్యామ్నాయంగా జగనన్న కాలనీలలో గృహాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, శాసనసభ్యులు మల్లాది విష్ణువర్ధన్, వెలంపల్లి శ్రీనివాసరావు, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్‌లు ఆయా నియోజకవర్గ పరిధిలోని భూముల క్రమబద్ధీకరణ, పలు సమస్యలను జిల్లా కలెక్టర్ డిల్లీరావు దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్, మున్సిపల్ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్, సబ్‌కలెక్టర్ అదితిసింగ్, నార్త్ తహాశీల్ధార్ మాధురి, భూసేకరణ సెక్షన్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, ప్రోటోకాల్ సెక్షన్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, సిటీప్లానర్ రామ్‌కుమార్‌లు ఉన్నారు.

# నాణ్యమైన సేవలతో పర్యాటకుల విశ్వసనీయతను పొందండి



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

ఇటీవల కాలంలో రాష్ట్రం నుంచి ఇతర ప్రాంతాలకు, దేశాలకు తీర్థయాత్రలు, పర్యాటక ప్రదేశాలు, వ్యాపారపరమైన పర్యటనలు చేసేవారి సంఖ్య పెరుగుతోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. నగరంలోని సీతా అపార్ట్మెంట్ మురళి ఫార్చ్యూన్‌రోడ్‌లో ఆదివారం ఢిల్లీ ప్రధాన కేంద్రంగా నిర్వహిస్తున్న మిరాకిల్ వెకేషన్స్ శాఖను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ద్వారా పర్యటించే పర్యాటకులను అన్ని ప్రాంతాలలోనూ సురక్షితంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఈ తరహా వ్యాపారంలో విశ్వసనీయత ముఖ్యమన్నారు. ప్రధానంగా ఇతర దేశాలలో పర్యటించే సమయంలో వారికి అవసరమైన రవాణా, భద్రత, వసతి ఏర్పాట్లు, ఆకర్షణీయ వస్తువులు కొనుగోలు చేసే సమయంలో సంస్థ సిబ్బంది ఆయా ప్రాంతాలలో ఉండే వాస్తవిక పరిస్థితులను పర్యాటకులకు తెలియజేయాలన్నారు. తద్వారా సంస్థతో వారికి మరింతగా అనుబంధం పెరుగుతుందన్నారు. దశల వారీగా వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవాలన్నారు. వ్యాపారంతో పాటు పర్యాటకుల నమ్మకం చూరగొనడమే లక్ష్యంగా సంస్థను నిర్వహించాలని కలెక్టర్ ఢిల్లీరావు కోరారు. మిరాకిల్ వెకేషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పూసల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఢిల్లీ, హైదరాబాద్ వంటి నగరాల్లో తమ సంస్థ ఇప్పటికే పర్యాటకులకు పలు ప్యాకేజీల ద్వారా సేవలందిస్తుందని, నేడు విజయవాడలో ప్రారంభమైన సంస్థ ద్వారా పర్యాటకులకు మెరుగైన సేవలు అందిస్తామని అన్నారు.

## తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో శాకంబరి ఉత్సవాలు

**పెనుగంచిప్రోలు, నేటి పత్రిక ప్రజావార్త :**



పెనుగంచిప్రోలు గ్రామంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ గోపయ్య సమంత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో ఈరోజు శాకంబరి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు, ఆషాడమాసం ఆదివారం సందర్భంగా అమ్మవారి మూలవిరాటు మరియు పరివార దేవతలకు దాతల సహకారంతో వివిధ రకాల కూరగాయలు,పండ్లతోటి అలంకరణ చేశారు. సాయంత్రం వరకు భక్తులకు అమ్మవారి శాకంబరీ దర్శనం కల్పిస్తామని డిప్యూటీ కలెక్టర్ & కార్యనిర్వహణాధికారి కె.రమేష్‌నాయుడు తెలియజేశారు.

# ఆగస్టులో గిడుగు రామమూర్తి జయంతి వారోత్సవాలు




**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు, వ్యావహారిక భాషోద్యమానికి మూలపురుషుడు అయిన గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని ఆగస్టు మాసంలో వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు అధికార భాషా సంఘం అధ్యక్షులు మరియు తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ ఇన్చార్జి అధ్యక్షుడు పి.విజయబాబు తెలిపారు. సోమవారం అమరావతి సచివాలయం నాల్గవ భవనం ప్రచార విభాగంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పరిపాలనా భాషగా తెలుగును అమలు పర్చేందుకు తెలుగు అధికార భాషా సంఘం తీసుకుంటున్న చర్యలను, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు అయిన గిడుగు వెంకట రామమూర్తి 160వ జయంతిని పురస్కరించుకుని ఆగస్టు 29 న తెలుగు భాషా దినోత్సవాన్ని ఎంతో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాల వారీగా భాషా వారోత్సవాలను నిర్వహించి సాహితీ స్రష్టలను, భాషా సేవకులను పెద్ద ఎత్తున గుర్తించి సముచిత స్థాయిలో సత్కరించడం జరుగుతుందన్నారు. అదే విధంగా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థలు, సేవా సంస్థల సౌజన్యంతో భాషా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. తమిళనాడులోని సేవా సంస్థల సహకారంతో భాషా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు త్వరలో మద్రాసు వెళుతున్నట్లు ఆయన తెలిపారు. తిరుపతిలో టిటిడి వారి సౌజన్యంతో భాషా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని, అన్నమయ్య పద సంపద, వేటూరి ప్రభాకర శాస్త్రి పరిశోధనలు, వెంగమాంబ సాహిత్యం తదితర అంశాలతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం సౌజన్యంతో ఉత్తరాంధ్రా సాహిత్య సభలను కూడా త్వరలో నిర్వహించనున్నామని ఆయన తెలిపారు.

అంతర్జాతీయ స్థాయిలోను మరియు రాష్ట్రేతరంగా ఉన్న తెలుగు సంఘాలు, వారి సమస్యలను పరిష్కరించేందుకు, వారికి సహకరించేందుకు ఈ ప్రాధికార సంస్థ కృషిచేస్తుందన్నారు. తెలుగు భాష అమలుకు సంబందించి ప్రాధికార సంస్థ చేసిన సూచనలను, సలహాలను అమలు పర్చని ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రభుత్వేతర వ్యాపార, వాణిజ్య సంస్థలకు కనిష్టంగా రూ.10 వేల నుండి గరిష్టంగా రూ.60 వేల వరకూ జరిమానా విధించే అధికారం ఈ సంస్థకు ఉందన్నారు. అయితే ఇటువంటి అధికారాలు ఉన్నాయి గదా అని ముందుగానే కొరడా ఝుళిపించకుండా తెలుగును పరిపాలనా భాషగా అమలు పర్చేందుకు ఎదురవుతున్న సమస్యలను జిల్లాల వారీగా జిల్లా కలెక్టర్లు, అధికారుల ద్వారా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు. అదే విధంగా రాష్ట్రంలోని వ్యాపార, వాణిజ్య సంస్థల బోర్డులు పైభాగంలో పెద్ద అక్షరాలతో తెలుగులోను, క్రింద చిన్న అక్షరాలతో ఆంగ్లంలోనూ ఉండేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లు అందరికీ సూచించడం జరిగిందని ఆయన తెలిపారు. స్పందన కార్యక్రమంలో నూటికి నూరు శాతం తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలని జిల్లా కలెక్టర్లకు సూచించడమైందన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానంలో తీర్పులు కూడా తెలుగులోనే వెలువరించాలని రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం తాత్కాలిక ప్రధాన న్యాయ మూర్తిని కలిసి కోరడమైందని ఆయన తెలిపారు.

ఎన్ని రాజకీయ విబేధాలు ఉన్నప్పటికీ భాష విషయానికి వచ్చే పాటికి తమిళనాడులోని అన్ని రాజకీయ పార్టీలు ఒకటవుతాయని, అదే తరహాలో తెలుగు భాషను పరిపుష్టం చేసుకునేందుకు, దాన్ని పరిరక్షించుకునేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# వైయస్సార్ భీమా క్లైమ్ ధ్రువ పత్రాలు నిర్దేశిత గడువులోగా సంబంధిత భీమా సంస్థకు సమర్పించాలి : కలెక్టర్



**తిరుపతి, నేటి పత్రిక ప్రజావార్త :**

వైయస్సార్ భీమా క్లైమ్ కొరకు అవసరమయ్యే ధ్రువపత్రాలను సకాలంలో నిర్దేశిత గడువులోపు సంబంధిత భీమా సంస్థ కు అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కే వెంకట రమణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌నందు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో వైఎస్సార్ భీమా క్లైమ్ లపై జిల్లా గ్రామ వార్డు సచివాలయం ఇంఛార్జి అధికారి సుశీల దేవి, డిఎల్డిఓ ఆదిశేషారెడ్డి, డిసిహెచ్ఎస్ అధికారిణి మణి తదితర సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షిస్తూ మరణించిన వైయస్సార్ భీమా పాలసీదారుకు సంబంధించిన క్లైమ్ ధ్రువ పత్రాలు సకాలంలో నిర్దేశిత గడువులోగా గ్రామ వార్డు సచివాలయం సంక్షేమ సహాయకులు ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని, డిఆర్డిఎ పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రమాద బీమా క్లైమ్ కొరకు సమర్పించే ఎఫ్ఐఆర్, పోస్ట్ మార్టం రిపోర్ట్ తదితర నివేదికలు సకాలంలో నిర్దేశిత గడువులోపు సదరు భీమా సంస్థకు పూర్తి స్థాయిలో అందించేలా ఉండాలని తెలిపారు. భీమా సంస్థ చెల్లింపులు సకాలంలో జరగాలని తెలిపారు.

## ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
వంగవీటి మోహనరంగా 76వ జయంతి సందర్భంగా మంగళవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధులు రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ నిరుపేదల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాటాలు చేసి ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలిచిన మహోన్నత వ్యక్తి వీఎం రంగా అని అన్నారు. పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు వంగవీటి మోహనరంగా అని కొనియాడారు. నిరంతరం పేదల కోసం పోరాడిన వ్యక్తి మోహనరంగా అని అన్నారు. పేదల కోసం పోరాడి అసువులు బాసిన వ్యక్తి వంగవీటి మోహనరంగా అని తెలిపారు. వంగవీటి మోహనరంగా స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. నేటి యువతకు ఆయనొక రోల్ మోడల్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మాత్యులు జోగి రమేష్, సెంట్రల్ శాసనసభ్యులు మల్లాది విష్ణు, జగ్గయ్యపేట శాసనసభ్యులు సామినేని ఉదయభాను, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ చైర్మన్ బండి పుణ్యశీల, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయవాడ నగర అధ్యక్షులు బొప్పన భవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరికీ వంద శాతం ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు అందించడమే లక్ష్యం !!



**పెనమలూరు / పామర్రు, నేటి పత్రిక ప్రజావార్త :**
ప్రజలందరికీ వంద శాతం ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు అందించడమే లక్ష్యంగా, అర్హులైన ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమం, సేవలు అందలేదనే పరిస్థితి ఉండరాదనే లక్ష్యంతో సీఎం జగన్ "జగనన్న సురక్ష" ను ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించిందని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్, పెనమలూరు, పామర్రు నియోజకవర్గాలలో ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, కైలే అనిల్ కుమార్‌లతో కలిసి పెనమలూరు మండలంలోని పెదపులిపాకలో 224, ఉయ్యూరు మండలం ఆకునూరులో 247, తోట్లవల్లూరు మండలం గరికపర్రులో 207, పామర్రు మండలం జుజ్జువరం గ్రామంలో 361 మంది ప్రజలు వివిధ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోగా జగనన్న సురక్ష కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని వారందరికీ వివిధ సభల్లో తన స్వహస్తాలు మీదుగా రేషన్‌కార్డులు, ఆదాయ, కుల, జనన, మరణ, వివాహ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ, ప్రజల ఇంటి వద్దకే వెళ్లి, వారికి ఏం కావాలో తెలుసుకుని, ఏ ఒక్క పేదవాడు కూడా చిన్నచిన్న సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పథకాలకు దూరం కాకూడదని, ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు సంపూర్ణంగా అందించడమే లక్ష్యంగా సచివాలయాల పరిధిలో నెల రోజులపాటు జగనన్న సురక్ష శిబిరాలు ఏర్పాటు కాబడిందన్నారు. లిఖితపూర్వకంగా, మౌకికంగా 1902 టోల్ ఫ్రీ ఫోన్ నెంబర్ ద్వారా వ్యక్తిగత సమస్యల పరిష్కారం చేస్తూ ఆ ప్రోగ్రాం ఒక మంచి వేదిక అయిందన్నారు ఎక్కడా పరిష్కారం కాని సమస్యల్ని పరిష్కరించుకునేందుకు నేరుగా ఫోన్ చేయాలని ప్రభుత్వం కోరడం పారదర్శక పాలనకు ఒక చక్కని ఉదాహరణని కలెక్టర్ అన్నారు. ప్రజలకు మరింత సేవ చేయాలని దృక్పథంతో జగనన్న సురక్ష పథకం ఇటీవల ప్రవేశపెట్టారన్నారు. కొన్ని సర్వీసులు మిగిలిపోవడంతో వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలోని 13 రకాల సేవలను పరిశీలించిన వారం రోజుల్లోనే ఆయా ధ్రువపత్రాలు నేరుగా దరఖాస్తుదారునికి నేరుగా అందించడం ఒక విప్లవాత్మకమైన సంస్కరణ అని అన్నారు. ఈ కార్యక్రమాల్లో పెదపులిపాక గ్రామ సర్పంచ్ గుంటూరు శ్రీనివాస్ చౌదరి, ఆకునూరు గ్రామ సర్పంచ్ వసంతకుమార్, గరికిపర్రు సర్పంచ్ వీరంకి రమాదేవి, కొమ్మూరి గ్రామ సర్పంచ్ బొమ్మరెడ్డి వెంకటేశ్వరరావు, జుజ్జువరపు గ్రామ సర్పంచ్ పుట్టి పున్నమ్మ, ఉయ్యూరు, పామర్రు జడ్పిటిసి కూనపురెడ్డి స్వరూపారాణి, ఎంపీపీ దాసరి అశోక్ కుమార్, ఉయ్యూరు ఆర్డీవో ఎన్. విజయ్ కుమార్, తాహసిల్దార్ మస్తాన్ రావు, ఎంపీడీవో ఉమాదేవి, డి ఎల్ డి ఓ నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
మాదకద్రవ్యాల రవాణా వినియోగం పై ప్రత్యేక నిఘా పెట్టి నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహారరెడ్డికి వివరించారు. నషా ముక్తి భారత్ అభియాన్‌లో భాగంగా మాదక ద్రవ్యాల నివారణకు చేపట్టిన చర్యల పై మంగళవారం రాష్ట్రస్థాయి నార్కో కోఆర్డినేషన్ ( ఎన్‌సిఓఆర్‌డి ) కమీటి సమావేశాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్ జవహారరెడ్డి ఆయన కార్యాలయం నుండి అన్ని జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమీషనర్లు, ఎస్పీలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలోని వీడియోకాన్ఫరెన్స్ హాల్‌నందు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు పాల్గొన్నారు. కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి మాదకద్రవ్యాల నివారణ, అమ్మకం వినియోగంపై కఠినచర్యలు తీసుకుంటున్నామన్నారు. గత ఐదు నెలలుగా గంజాయి మత్తుపదార్థాల వినియోగంపై దృష్టి పెట్టామన్నారు. విజయవాడ పరిధిలోని గంజాయి వినియోగానికి హాట్‌స్పాట్‌లుగా గుర్తించిన ప్రాంతాలలో మాదక ద్రవ్యాల వినియోగించే ప్రాంతాలలో తనిఖీలను ముమ్మరం చేశామన్నారు. గంజాయి అమ్మకం నిర్వహించే వారిపై కఠినచర్యలు నమోదు చేయాలని పోలీస్‌శాఖను ఆదేశించామన్నారు. జిల్లాలోకి ఎటువంటి డ్రగ్స్ ప్రవేశించకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కళాశాలల స్థాయిలో విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వలన కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి సరఫరా దారులను అదుపులోకి తీసుకుని వారిపై పిడి యాక్ట్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయి వినియోగంచే వారిని అదుపులోకి తీసుకుని వారి ద్వారా వివరాలను సేకరించి జిల్లాకు గంజాయి సరఫరా చేసేవారిని గుర్తించి కేసులు నమోదు చేస్తున్నామన్నారు. పేదల నివాస ప్రాంతాలు, మురికి వాడలు, పాఠశాలలు, కళాశాలలో మత్తుపదార్థాల వినియోగిస్తే కలిగే దుష్ఫలితాలు, చట్టాలు, కేసులపై అవగాహన కల్పిస్తునట్లు కలెక్టర్ డిల్లీరావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు.

# దేవాలయఆస్తుల పరిరక్షణకై దేవాదాయ చట్ట సవరణకు గవర్నర్ ఆమోదం

**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
రాష్ట్రవ్యాప్తంగానున్న దేవాదాయశాఖ ఆస్తుల పరిరక్షణకై చట్ట సవరణ చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయానికి రాష్ట్ర గవర్నర్ ఆమోదం తెలుపుతూ ఆర్డినెన్సును జారీ చేయడం జరిగిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. శాసనసభ ఆమోదంతో త్వరలోనే ఈ ఆర్డినెన్స్ చట్టంగా మారనున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం వెలగపూడి ఆంధ్రప్రదేశ్ సచివాలయం నాల్గో బ్లాక్ పబ్లిసిటీ సెల్‌లో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ దేవాదాయ చట్టం సెక్షన్ 83లో మార్పులు చేర్పులతో దేవాలయ ఆస్తుల పరిరక్షణ సాధ్యమయిందన్నారు. దేవాలయాల భూములు ఆక్రమణలను అడ్డుకోవడానికి, ఆస్తుల పరిరక్షణకు సీసిఎల్ఏ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి, జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేయడమైందన్నారు. దేవాదాయ శాఖకు చెందిన భూముల లీజు కాల పరిమితి పూర్తి అయినప్పటికీ రెన్యూవల్ చేయించుకోకపోవడము, డబ్బు చెల్లించకపోవడం వంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఈ చట్ట సవరణ దోహదపడుతుందన్నారు. ఖాళీగా ఉన్న భూములు, స్థలాలను వేలం నిర్వహిస్తామని, దానిలో గతంలో బకాయిలు ఉన్నవారు పాల్గొనకూడదని అన్నారు. దేవాదాయ శాఖకు చెందిన ఆస్తుల పరిరక్షణకు ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి కమిటీలు దేవాలయ భూములపై ప్రతినెలా సమీక్షించి నివేదిక ఇస్తారని, దానిపై రాష్ట్రస్థాయి కమిటీ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. భూముల ఆక్రమణలకు సంబంధించి ఎటువంటి లొసుగులు లేకుండా పారదర్శకంగా వేలం వేస్తామన్నారు. దేవాదాయ భూముల్లో అగ్రికల్చర్, కమర్షియల్ మొత్తం కలిపి సుమారు 4,53,173 ఎకరాలు ఉన్నాయని చెప్పారు. విలువైన భూముల్లో తాత్కాలిక కట్టడాలను అనుమతిస్తామన్నారు. రూ.5లక్షలలోపు ఆదాయం ఉన్న దేవాలయాలకు ట్రస్టీలను ఏర్పాటు చేయమని స్పష్టం చేసారు. ఆయా దేవాలయాలకు వంశపారంపర్య అర్చకులు, వ్యవస్థాపక కుటుంబ సభ్యులకు నిర్వహణను అప్పగిస్తామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ఇచ్చిన హామీ మేరకు అటువంటి దేవాలయాల అర్చకులకు వేతనాలను పెంచామని చెప్పారు. ప్రముఖ దేవాలయాల్లో ఈవోలకు కొన్ని అధికారాలు ఉంటాయని, అయితే దేవాలయాలపై సర్వాధికారాలు తమకే ఉంటాయని ట్రస్టీలు భావించకూడదన్నారు. సమన్వయంతో అందరూ పనిచేసి ఆలయ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు.
శ్రీశైలంలో కుంభాభిషేకం అంశంపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆరు వారాల గడువులోపల అందరి అభిప్రాయాల్ని తీసుకుని నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ యస్.సత్యనారాయణ, అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్ పాల్గొన్నారు.



## ఐదు విభాగాల్లో నంది నాటక అవార్డులు : పోసాని కృష్ణ మురళి

**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
నంది నాటక అవార్డులను ఐదు విభాగాల్లో అర్హులైన కళాకారులకు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు రాష్ట్ర ఫిల్మ్, టివి మరియు థియేటర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోసాని కృష్ణ మురళి తెలిపారు. మంగళవారం వెలగపూడి ఆంధ్రప్రదేశ్ సచివాలయం నాల్గో బ్లాక్ పబ్లిసిటీ సెల్‌లో రాష్ట్ర ఫిల్మ్, టివి మరియు థియేటర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ టి.విజయకుమార్‌రెడ్డితో కలసి ఆయన పాత్రికేయులతో మట్లాడుతూ ఈ ఏడాది నంది నాటక అవార్డులను ప్రధానం చేసేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఎంతో నమ్మకంతో తనకు రాష్ట్ర ఫిల్మ్, టివి మరియు థియేటర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చే టప్పుడే ఎటు వంటి వివాదాలకు తావులేకుండా నంది నాటక అవార్డులను ఉత్తమ కళాకారులకు అందజేయాలని ఆదేశించారన్నారు. తొలుత పద్య, సాంఘిక, బాలలు, యువజన నాటకాలతో పాటు సాంఘిక నాటిక అనే ఐదు విభాగాల్లోని ఉత్తమ కళాకారులకు ఈ నంది నాటక అవార్డులు ఇచ్చేందుకు నిర్ణయించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ నంది నాటక అవార్డులు ఆ వర్గానికో ఈ వర్గానికో కాకుండా నిజమైన అర్హులకు మాత్రమే ఇవ్వాలన్నదే మా లక్ష్యం అన్నారు. 1998 నుండి 2004 వరకూ నంది నాటక అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం హైదరాబాదు రవీంద్రభారతికే పరిమితం అయిపోయిందన్నారు. అయితే 2005 సంవత్సరంలో వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన తదుపరి వారి సూచనల మేరకు ఈ నంది నాటక అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం జిల్లాల్లో కూడా నిర్వహించడం ప్రారంభం అయిందన్నారు. అందుకు తిరుపతి, రాజమండ్రి, నెల్లూరు, నిజామాబాద్ తదితర జిల్లాలలోని ఆడిటోరియంలను పునర్నించడం జరిగిందని ఆయన తెలిపారు. పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెపుతూ ఏపీలో ఉచితంగా షూటింగ్‌లు చేసుకోవచ్చని ఉత్తర్వులే ఉన్నాయని, ఏపీలోనూ సినీపరిశ్రమ అభివృద్ధి చెందేందుకు అన్నిరకాల ప్రయత్నాలు చేయటం జరుగుతుందన్నారు. రాష్ట్రం విడిపోయాక సినిమా పరిశ్రమకు చాలా ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫిల్మ్, టివి మరియు థియేటర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ టి.విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ పద్య,



సాంఘిక, బాలలు, యువజన నాటకాలతో పాటు సాంఘిక నాటిక అనే ఐదు విభాగాల్లో మొత్తం 73 అవార్డులను ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఇందు కోసం బుధవారం నోటిఫికేషన్ జారీ చేస్తున్నామని, ధరఖాస్తు చేసుకునేందుకు ఒక మాసం గడువు ఇస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫిల్మ్, టివి మరియు థియేటర్ డవలెప్మెంట్ కార్పొరేషన్ అఫిషియెల్ వెబ్ సైట్ ద్వారా ధరఖాస్తు చేస్తుకునే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లోని తెలుగు నాటక సమాజాలు కూడా ఆన్ లైన్ ద్వారా అప్లై చేసుకోవచ్చన్నారు. ధరఖాస్తు చేసుకున్నవారు వారి ధరఖాస్తును ఉపసంహరించుకునేందుకు వారం రోజుల పాటు గడువు కూడా ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన కేంద్రంలో తుది పోటీలను ఆరు రోజుల పాటు నిర్వహించి, ఏడో రోజు నంది నాటక అవార్డుల ప్రదానోత్సం జరుగుతుందని ఆయన తెలిపారు.

## బహిరంగ మార్కెట్లోకి గోధుమలు, బియ్యం

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
దేశవ్యాప్తంగా ఆటా మరియు బియ్యం రిటైల్ ధరలలో ద్రవ్యోల్బణ ధోరణిని స్థిరీకరించడానికి/నియంత్రించడానికి ఓపెన్ మార్కెట్ సేల్ స్కీమ్ (డొమెస్టిక్) ద్వారా బహిరంగ మార్కెట్లో గోధుమలు మరియు బియ్యాన్ని తీసుకురావాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. పైన పేర్కొన్న వాటిని అమలు చేయడానికి, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ప్రాంతీయ కార్యాలయం, అమరావతి 28.06.2023న 1వ ఈ-వేలం ద్వారా 6839 ఎంటిల గోధుమలను అందుబాటులో ఉంచారు. ఇందులో 11 మంది బిడ్డర్లు పాల్గొన్నారు మరియు 900ఎంటిల గోధుమలు విక్రయించబడ్డాయి. ఇ-వేలం కోసం, 05.07.2023 నాటికి 6400ఎం టి ల గోధుమలు మరియు 7000ఎంటిల బియ్యాన్ని ఓఎంఎస్ఎస్ (డి) కింద అందుబాటులో వుంచుతారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ప్రతి బుధవారం దేశవ్యాప్తంగా ఈ వేలం ద్వారా గోధుమలు మరియు బియ్యం విక్రయాలు కొనసాగుతాయి. ఆసక్తి ఉన్న పిండి మిల్లులు/వ్యాపారులు/ఎంపానెల్ బల్క్ కొనుగోలుదారులు గోధుమలు/వరి ఉత్పత్తుల తయారీదారులు తదుపరి రిజిస్ట్రేషన్ మరియు ఈ-వేలంలో పాల్గొనేందుకు www.valuejunction.in/fci లో ఎం-జంక్షన్ని సంప్రదించవచ్చు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం.. ఏపీలో మూడు రోజులు వర్షాలు

**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
బంగాళాఖాతంలో నేడు ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఈ ఉపరితల ఆవర్తనం బలపడి రానున్న రోజుల్లో అల్పపీడనంగా మారనుంది. జూలై 4 మధ్యాహ్నం నుంచి జూలై 7 వరకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో అల్పపీడనం ప్రభావంతో వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా జూలై 4, 5 తేదీల్లో ఆంధ్ర జిల్లాలు .. బాపట్ల, ఎన్.టీ.ఆర్, కృష్ణా, ఏలూరు, కోనసీమ, ఉత్తర ప్రకాశం, పల్నాడు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాలతో పాటుగా కర్నూలు,నంధ్యాల,అనకాపల్లి జిల్లాల్లో విస్తారంగా మోస్తరు నుంచి భారీవర్షాలు పడతాయని వాతావరణశాఖ తెలిపింది. మిగిలిన జిల్లాలు విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరిసీతారామరాజు, పార్వతీపురం మన్యం, నెల్లూరు, తిరుపతి, కడప, అనంతపురం, సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఏపీ వాతావరణశాఖ వెల్లడించింది. ఏపీలో ఉత్తర కోస్తా, యానాంలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు .. ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉంది. అటు భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. రాయలసీమలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశం ఉంది.

## గొప్ప మనసున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
దేశంలోనే గొప్ప మనసున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 24 వ డివిజన్ 36 వ వార్డు సచివాలయ పరిధిలో సోమవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కుక్కల అనితతో కలిసి ఆయన పాల్గొన్నారు. కృష్ణారావు వీధి, రామనాథం వీధులలో విస్తృతంగా పర్యటించి 90 గడపలను సందర్శించారు. ప్రతిఒక్కరినీ పేరుపేరున ఆప్యాయంగా పలకరిస్తూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత అవగాహన కల్పించారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంతకం చేసిన కరపత్రాలను అందజేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అధికారులు, ప్రభుత్వ సిబ్బందిలో జవాబుదారీతనాన్ని పెంచిందని మల్లాది విష్ణు అన్నారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించారు. మ్యాన్ హోల్స్ నుంచి మురుగు బయటకు పొంగకుండా.. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, కృష్ణారావు వీధి, రామనాథం వీధులలో నూతన రహదారుల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయవలసిందిగా సూచించారు. అలాగే పేదలందరికీ ఇళ్ల పథకం తొలిదశ నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని పీఓయూసిడి విభాగాన్ని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతిఒక్క పేద కుటుంబానికి ఏదో ఒక పథకం రూపంలో చేకూరుతున్న మేలును చూసి జీర్ణించుకోలేక బురదచల్లే కార్యక్రమాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షాల కుట్ర రాజకీయాలను ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి, నాయకులు కుక్కల రమేష్, కొమ్ము చంటి, బెల్లపు సత్యనారాయణ, కంభంపాటి మోజస్, నాగభూషణం, చింతకాయల చిట్టిబాబు, క్రాంతి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## సూర్యుడు ఉదయించక ముందే తలుపుతట్టి పించన్లు అందించే ప్రభుత్వం: మంత్రి జోగి

**పెడన, నేటి పత్రిక ప్రజావార్త :**
పరిపాలన ప్రజలకు మరింత చేరువ చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామంత్రి జోగి రమేష్ అన్నారు. పెడన పురపాలక సంఘంలో 4, 5, 6 వార్డులకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం స్థానిక షాదీ ఖానాలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజితసింగ్‌తో కలిసి లబ్ధిదారులకు ఆదాయ, కుల, వివాహ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. తొలుత 4, 5, 6 వార్డుల పరిధిలో ఎంపికైన 25 మంది వాలంటీర్లకు సేవా మిత్ర, సేవారత్న, సేవా వజ్ర పతకాలు, మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేసి శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వైయస్సార్ భరోసా కార్యక్రమం కింద సూర్యుడు ఉదయించక ముందే తలుపు తట్టి అవ్వ తాతలకు పింఛన్లు అందజేస్తున్న విషయం గుర్తు చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమం కింద సచివాలయాల పరిధిలో వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి వారికి అవసరమైన 11 రకాలైన ధ్రువపత్రాలను ఉచితంగా అందించే కార్యక్రమం అన్నారు. ఎలాంటి అవినీతికి తావులేకుండా పారదర్శకంగా ధ్రువపత్రాల మంజూరు చేయడంతో లబ్ధిదారులు అధికారుల చుట్టూ తిరక్కుండా విలువైన సమయం ఆదా అవుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఇది ఎంతో మంచి కార్యక్రమం అన్నారు పెడనలో 4,5,6 వార్డుల పరిధిలో 210 మందికి 325 ధ్రువపత్రాలు అందజేస్తున్నట్లు, వీటిలో 180 ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు కాగా 134 ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కేడిసిసి బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ ఇంచార్జి ఎండి ఖాజా, ఫ్లోర్ లీడర్ గంగయ్య, మున్సిపల్ కమిషనర్ మహేంద్ర, తాసిల్దారు మధుసూదన్ రావు, కౌన్సిలర్లు రెహంతున్నీసా, బాబూలాల్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహం ఆవిష్కరణ

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం పల్లపోతు మురళీకృష్ణ, కొనకళ్ళ విద్యాధర రావు, అధ్వర్యంలో విజయవాడ నదిపొడ్డు నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆ విగ్రహాన్ని మాజీ మంత్రి పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామీ, రోశయ్య కొడుకు అల్లుడు ఎమ్మెల్యే మద్దలి గిరి తదితర ఆర్యవైశ్య ప్రముఖులు కలిసి ఆవిష్కరించారు. అనంతరం భారీ బైక్ ర్యాలీ నిర్వహించి తుమ్మలపల్లి కళాక్షేత్రం నందు బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ ఆర్యవైశ్య కులానికి వన్నె తెచ్చిన వ్యక్తి రోశయ్య అని కొనియాడారు. విజయవాడలో కాంశ్య విగ్రహం ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైశ్యులు పాల్గొన్నారన్నారు. మహాసభ ను ఏర్పాటు చేసిన వ్యక్తి రోశయ్య అని అన్నారు. ఆయన స్ఫూర్తితో పని చేస్తున్నామన్నారు. ఆయన ఆశయ లకు అనుగుణంగా నడుస్తామని తెలిపారు. వెలంపల్లి మాట్లాడుతూ ఈ నెల 4న రోశయ్య జయంతి సందర్భంగా ఈ రోజు ఆయన విగ్రహం ఆవిష్కరించుకోడం జరిగిందన్నారు. రోశయ్య విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషం గా వుందన్నారు. 17 సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టిన వ్యక్తి రోశయ్య అని కొనియాడారు. అందరూ పెద్దాయన అని పిల్చుకునే వ్యక్తి రోశయ్య అని తెలిపారు. వారి స్ఫూర్తితో అందరూ ముందుకు సాగాలన్నారు. ఆయన ఆర్యవైశ్య కులానికి ఒక దిక్సూచి అని తెలిపారు. ఆయన బాటలో ప్రతిఒక్కరూ నడుస్తున్నట్లు తెలిపారు. ఆయన ఆజాత శత్రువు అని అన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు శాసన మండలి సభ్యులు అన్నా రాంబాబు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు మద్దాలి గిరిధర్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, రోశయ్య కుమారుడు కొణిజేటి శివ సుబ్బారావు, అల్లుడు పైడా కృష్ణప్రసాద్, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ముక్కాల ద్వారకానాథ్, రేపాల శ్రీనివాసరావు, గుబ్బా చంద్రశేఖర్, కుప్పం ప్రసాద్, మెట్టమళ్ళీ రమేష్, పెనుగొండ సుబ్బారాయుడు, పోతుల సురేష్,గుడివాడ గున్నయ్య సెట్టి, ఒబిలి సెట్టి కనకరాజా, రాజా, విజయవాడ కార్పొరేటర్లు గుడివాడ నరేంద్ర, మండేపూడి చటర్జీ, చెన్నగిరి రామ్మోహన్ తదితర ఆర్యవైశ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నూతన 108 అంబులెన్స్ వాహనముల ప్రారంభోత్సవం



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

108 అంబులెన్స్ సేవలను మరింత బలోపేతం చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 146 కొత్త అంబులెన్స్‌లను కొనుగోలు చేసింది. ఈ అంబులెన్స్‌లను సోమవారం సీఎం వైఎస్ జగన్ తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం వద్ద ప్రారంభించారు. గత టీడీపీ ప్రభుత్వంలో నిర్వీర్యం అయిన 108 వ్యవస్థను బలోపేతం చేస్తూ 2020లోనే మండలానికి ఒక 108 అంబులెన్స్‌ను సమకూర్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అప్పట్లో రూ.96.50 కోట్లతో అధునాతన సౌకర్యాలతో 412 కొత్త అంబులెన్స్‌లు కొనుగోలు చేసి, అప్పటికే ఉన్నవాటికి మరమ్మతులు చేసి 748 అంబులెన్స్‌లతో సేవలను విస్తరించారు. గత అక్టోబర్‌లో రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల ప్రజల కోసం రూ.4.76 కోట్లతో ప్రత్యేకంగా 20 అదనపు అంబులెన్సులు కొనుగోలు చేశారు. దీంతో రాష్ట్రంలో అంబులెన్సుల సంఖ్య 768కి చేరింది. ఎక్కువకాలం ప్రయాణించి దెబ్బతిన్నస్థితిలో ఉన్నవాటి స్థానంలో కొత్త అంబులెన్సులను ప్రవేశపెట్టడం కోసం తాజాగా రూ.34.79 కోట్లతో 146 అంబులెన్స్‌లను ప్రభుత్వం కొనుగోలు చేసింది. మరోవైపు 108 సేవల కోసం ఏటా ప్రభుత్వం రూ.188.56 కోట్లు ఖర్చు చేస్తోంది. ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా గత టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుతం సేవలు ఎంతో మెరుగుపడ్డాయి. అప్పట్లో 1.19 లక్షల మందికి ఒక అంబులెన్స్ ఉండగా ప్రస్తుతం 74,609 మంది జనాభాకు ఒక అంబులెన్స్ ఉంది.

ప్రస్తుతం రాష్ట్రంలో 108 అంబులెన్స్‌లు రోజుకు 3,089 కేసులకు అటెండ్ అవుతున్నాయి. ఇలా 2020 జూలై నుంచి ఇప్పటి వరకు 33,35,670 ఎమర్జెన్సీ కేసుల్లో అంబులెన్స్‌లు సేవలందించాయి. సేవలు వినియోగించుకున్న వారిలో అత్యధికంగా 23% మంది మహిళలే. అనంతరం 12% మంది కిడ్నీ సంబంధిత సమస్యలున్నవారు, 11% మంది రోడ్డు, ఇతర ప్రమాదాల బాధితులు ఉన్నారు. కొత్త 108 వాహనంలో వైద్య పరికరాలు, సౌకర్యాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి కె వి ఉషాశ్రీచరణ్, రహదారులు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రామలింగేశ్వరరావు(రాజా), ఎంపీ నందిగాం సురేష్, వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎం టి కృష్ణబాబు, పలువురు ఇతర ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి ఆలయంలో వైభవంగా ఆషాఢ మాస గురు పౌర్ణమి గరుడ సేవ



**తిరుమల, నేటి పత్రిక ప్రజావార్త :**

తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం రాత్రి 7గంటలకు గరుడ వాహన సేవ ప్రారంభమైంది.సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాలలోనూ గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. గరుడ వాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని తెలియజెబుతారు. అంతేగాక జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజెబుతున్నాడు.

## స్వచ్ఛతా పక్వాడ 2023 కార్యక్రమము

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**



నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్, రీజనల్ ఆఫీస్, విజయవాడ వారు తన యొక్క సెక్రటరీ, గణాంక మరియు కార్యక్రమాల అమలు మరియు మంత్రిత్వ శాఖ ఆదేశములు మేరకు స్వచ్ఛతా పక్వాడ 2023 కార్యక్రమం మంగళవారం సిపిడబ్ల్యుడి కాన్ఫరెన్స్ హాల్, సిజిఓ కాంప్లెక్స్, ఆటోనగర్, విజయవాడ నందు సిబ్బందికి స్వచ్ఛతా అవగాహన కార్యక్రమంను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంనకు నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్, రీజనల్ ఆఫీస్, విజయవాడ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఆర్.కిరణ్ కుమార్, ఐఎస్ఎస్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంను ఎం.శామ్యూల్, అసిస్టెంట్ డైరెక్టర్ & హెచ్ఓ, ఎన్ఎస్ఎస్ఓ (ఎఫ్ఓడి) ప్రారంభిస్తూ ఈ కార్యక్రమమునకు విచ్చేసిన గౌరవ అతిధుల గురించి సభలో పాల్గొన్న నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ అధికారులకు మరియు సిబ్బందికి పరిచయ కార్యక్రమమును నిర్వహించారు. ముఖ్య అతిధులుగా వేంకటేశ్వరరావు, చీఫ్ ఇంజనీర్, సిపిడబ్ల్యుడి, ఎం.సోమేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆల్ ఇండియా రేడియో విజయవాడ, డాక్టర్ జి.డి.58, జాయింట్ డైరెక్టర్ పిఐబి, విజయవాడ, పి.రత్నాకర్, జాయింట్ డైరెక్టర్, సిబిసి, విజయవాడలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంనకు అధ్యక్షత వహించిన ఆర్.కిరణ్‌కుమార్, 155 డిప్యూటీ డైరెక్టర్ జనరల్, నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్, రీజనల్ ఆఫీస్, విజయవాడ వారు మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో పరిశ్రుభ్రత మరియు పారిశుధ్యం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ క్లీన్ ఇండియా గురించి మాట్లాడారు. సభలో పాల్గొన్న అతిధులు కూడ స్వచ్ఛతా పక్వాడ గురించి మాట్లడటం జరిగింది. అతిధులను జ్ఞాపికలతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు మరియు సిబ్బంది స్వచ్ఛతను పాటిస్తామని "ప్రతిజ్ఞ" చేయడం జరిగింది. ఈ కార్యక్రమం అనంతరం ఆర్.కిరణ్‌కుమార్, ఐఎస్ఎస్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రజలకు స్వచ్ఛతా కార్యక్రమము గురించి అవగాహన కల్పించడంలో భాగంగా ఆటోనగర్, బందర్‌రోడ్డు మీదుగా బ్యానర్‌తో ప్లకార్డ్స్ ప్రదర్శన నిర్వహించారు.

## మంగళగిరిలో ఘనంగా నరసింహుని ముత్యాల పందిరి ఉత్సవం

**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

మంగళగిరి నగరంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ నరసింహుని సన్నిధిలో గురపౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం ముత్యాల పందిరి వాహనోత్సవం ఘనంగా నిర్వహించారు. కాగా ఉత్సవం కైంకర్యపరులు అంగా ఉపేంద్ర వర్మ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 1200మంది కళాకారులతో కూడిన 30 బృందాలతో విశేష కార్యక్రమాలను ఏర్పాటు చేసి వాటిని ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో ఎక్కించే ప్రయత్నం చేశారు. తొలుత లక్ష్మీ నారాయణ స్వామి వారి ఆలయం వద్ద నుండి నారసింహునికి పట్టువస్త్రాలను కైంకర్యపరులు ఉపేంద్రవర్మ కనకతప్పెట్లు నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. అనంతరం జరిగిన ముత్యాల పందిరి ఉత్సవానికి మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి హాజరయ్యారు. ఆలయంలో మొత్తం 30 బృందాలు వివిధ రకాలైన కళాకృతులతో భక్తులను అలరించారు. ఈ సన్నివేశాన్ని ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు లో ఎక్కించాలని కైంకర్యపరులు ప్రయత్నించారు. కాగా స్వామివారి ఉత్సవం ఉరేగింపు ఆలయం వెలుపలకు చేరే సరికే ఒక్కసారిగా తీవ్రవర్షం కురిసింది. దీంతో ఉత్సవం సేవకు, బుక్‌ఆఫ్ రికార్డుకు కొంతమేర అంతరాయం ఏర్పడింది. కాగా కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో ఆలయం వద్దకు హాజరయ్యారు. ఆలయ ఈవో అన్నపరెడ్డి రామకోటిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించగా ఆలయ అర్చకులు సుందరంగా స్వామివారిని అలంకరించారు.

# మహిళా, శిశు సంక్షేమ శాఖపై సీఎం జగన్ సమీక్ష



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

మహిళా, శిశు సంక్షేమ శాఖపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం సమీక్ష సమావేశం చేపట్టారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ వైయస్సార్ సంపూర్ణ పోషణ, వైయస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కింద ఇచ్చే టేక్ హోం రేషన్ సరుకులన్నీ అత్యంత నాణ్యంగా ఉండాలని సీఎం ఆదేశించారు. ఈ సరుకుల పంపిణీపై మంచి ఎస్ఓపీ పాటించాలని అధికారులను ఆదేశించారు. క్వాలిటీ సర్టిఫికేషన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. పంపిణీలో ఎలాంటి లోపాలు లేకుండా, అర్హులైన వారందరికీ అందేలా ఎస్ఓపీ పాటించాలని, దీనికి సంబంధించి అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంపై బలమైన పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు గ్రామంలో ఆరోగ్యం, పారిశుద్ధ్యం, పౌష్టికాహార రోజుగా నెలలో రెండుసార్లు పాటించేలా చర్యలు తీసుకున్నామని అధికారులు అన్నారు. ప్రతి నెల మొదటి, మూడవ శుక్రవారాల్లో ఈ కార్యక్రమాలు జరగాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో దీన్ని అనుసంధానం చేయాలన్నారు. పిల్లల ఎదుగుదల, టీకాలు, పౌష్టికాహారం, చక్కటి ఆరోగ్యపు అలవాట్లు తదితర వాటిపై ఈ కార్యక్రమం ద్వారా పర్యవేక్షణ చేయాలన్నారు. ఇందులో భాగంగా చికిత్సకు అవసరమైన వారిని రిఫరెల్ చేసే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్‌తో పాటు అంగన్‌వాడీల సూపర్‌వైజర్ కూడా ఉండి.. ఈ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలన్నారు. గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాల మేరకు పిల్లల ఎదుగలను పర్యవేక్షించేందుకు స్టాడీ మీటర్, ఇన్‌ఫాంటో మీటర్, సాల్టర్ స్కేల్, బరువును తూచే యంత్రాలన్నింటినీ కూడా త్వరలోనే ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు. పీపీ-1, పీపీ-2 తరగతుల విద్యార్థులకు ఇచ్చే పాఠ్యప్రణాళికపైనా కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎం అన్నారు. ఇంగ్లీషు భాషపై పునాదులు పిల్లలకు అదే దశలో ఏర్పాటు కావాలన్నారు. పదాలు పలికేతీరు, ఫొనిటెక్స్ తదితర అంశాలపై శ్రద్ధపెట్టాలన్నారు. పిల్లలు త్వరగా నేర్చుకునే వయసు కాబట్టి వారికి అత్యుత్తమ బోధన అందించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ల డివైజ్‌లో స్పోకెన్ ఇంగ్లీషుకు సంబంధించి పాఠ్యాంశాలను లోడ్ చేయడం ద్వారా వివిధ పదాలను ఎలా ఉచ్ఛరించాలన్న దానిపై తగిన శిక్షణ పిల్లలకు ఇచ్చినట్టు అవుతుందన్నారు. దీనిపై మంచి ఆలోచనలు చేసి.. వాటిని కార్యరూపంలోకి తీసుకురావాలన్నారు. తద్వారా ఇప్పుడున్న బోధనా పద్ధతులను మరింత బలోపేతం చేయాలన్నారు. అంగన్వాడీల్లోని 3-6 ఏళ్ల వయస్సున్న పిల్లలకు 19 వస్తువులతో కిట్లు ఇస్తున్నామని అధికారులు అన్నారు. ఈనెలాఖరు కల్లా ఈ పంపిణీ పూర్తవుతుందని అధికారులు అన్నారు.

**అంగన్‌వాడీ సెంటర్లలో నాడు-నేడు పనులపైనా సీఎం సమీక్ష**

అంగన్‌వాడీల్లో నాడు-నేడు పనులపై ముందుకెళ్తున్నామన్నారు. సచివాలయల్లోని సిబ్బంది ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించి ఎక్కడెక్కడ మరమ్మతులు చేయాలన్న దానిపై పూర్తిగా వివరాలు సేకరించారని అధికారులు తెలిపారు. తరగతి గదులు, టాయిలెట్లు, రక్షిత తాగునీరు, ఫర్నిచర్ ఇలా అన్నిరకాలుగా కనీస సదుపాయాలతో అంగన్‌వాడీలను అభివృద్ధి చేయాలని సీఎం అన్నారు. నాడు-నేడు ఫేజ్-2లో భాగంగానే ఈ పనులను పూర్తిచేయాలన్నారు. ఆగస్టు 15 కల్లా ఈ పనులు ప్రారంభం కావాలని, ఫేజ్ -2 కార్యక్రమంలో భాగంగా స్కూళ్లలో చేపడుతున్న పనులతో పాటు ఇవి పూర్తి కావాలన్నారు. బాల్య వివాహాల నిరోధంలో కళ్యాణమస్తు, షాదీతోఫా, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెనలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ పథకాలు పొందాలంటే వధూవరులు తప్పనిసరిగా టెన్త్ చదవాలన్న నిబంధన కూడా పెట్టామన్నారు. ఒక్కసారి టెన్త్ చదివాక తర్వాత ఇంటర్మీడియట్‌కు అమ్మ ఒడి, ఆపై చదువులకు విద్యాదీవెన, వసతి దీవెన అమలవుతున్నాయన్నారు. దీనివల్ల బాగా చదువుకునేలా ఈ పథకాలు తగిన ప్రోత్సాహాన్ని కలిగిస్తాయన్నారు. కళ్యాణమస్తు, షాదీ తోఫా, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన కార్యక్రమాలు, విద్యారంగంలో, బాల్య వివాహాలను అడ్డుకట్టవేయడంలో ఎంత కీలకమనే విషయంపై చైతన్యం కలిగించాలన్నారు. మండలానికి ఒక జూనియర్ కళాశాల అమ్మాయిల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నామని అధికారులు అన్నారు. టెన్త్ తర్వాత చదువులు ఆపేయాల్సిన పరిస్థితి రాకుండా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఈ ప్రత్యేక జూనియర్ కళాశాలలు బాగా తోడ్పడతాయన్నారు. చిల్డ్రన్ హోమ్స్‌లో సిబ్బంది కొరత లేకుండా చూడాలన్నారు. ఈ హోమ్స్ నిర్వహణలో సిబ్బందికి తర్ఫీదు ఇవ్వాలన్నారు. చిల్డ్రన్ హోమ్స్‌లో పిల్లలకు మంచి శిక్షణ, బోధనాంశాలు ఉండేలా చూడాలన్నారు. ఈ హోమ్స్‌లో పరిస్థితులు మెరుగుపడలా చూడాలని సీఎం అన్నారు.

ఈ సమావేశానికి మంత్రి ఉషశ్రీ చరణ్, సీఎస్ డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎం టి.కృష్ణబాబు, మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, పాఠశాల విద్యాశాఖ (మౌలిక వసతుల కల్పన) కమిషనర్ కాటమనేని భాస్కర్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ ఎం.విజయ సునీత, ఏపీ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ అండ్ వీసీ జి.వీరపాండ్యన్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఆంధ్రప్రదేశ్ యువతకు జర్మనీలో ఉద్యోగాలు : సురేష్‌కుమార్

**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలను కల్పిస్తోన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ తాజాగా జర్మనీలో పనిచేసేందుకు 150 మంది అర్హులైన బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులను ఎంపిక చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ కోసం విడుదల చేసిన ప్రకటనకు విశేష స్పందన లభించిందని ఆయన స్పష్టం చేశారు. నాలుగు దశల్లో పూర్తికానున్న ఉద్యోగ ఎంపిక ప్రక్రియలో భాగంగా జులై, 6వ తేదీ గురువారం శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లా కేఎల్ యూనివర్సిటీ వేదికగా ఎ1, ఎ2, బి1 లెవల్ వరకు అభ్యర్థులకు జర్మనీ భాషలో శిక్షణ ఇవ్వనున్నట్లు నైపుణ్యశాఖ పేర్కొంది. జర్మనీలో ఉద్యోగం చేసేందుకు ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 10వ తేదీ నుండి.. టక్ట్ ఇంటర్నేషనల్, ఆక్సిలా అకాడమీ బృందం సంయుక్తంగా జర్మన్ భాషలో రెండు నెలల పాటు శిక్షణనిచ్చి అనంతరం వీసా ప్రక్రియ పూర్తి చేస్తుందన్నారు. స్కిల్ ఇండియా ఇంటర్నేషనల్, నేషనల్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఇంటర్నేషనల్ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో నియామకాలను మరింత సులభం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. అందుకోసం ఓవర్సీస్ మ్యాన్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా ఏర్పాటైన రిజిస్టర్ రిక్రూట్ ఏజెన్సీ తదితర సంస్థల సహకారంతో అవసరమైన మానవవనరులను అందించేందుకు రాష్ట్రం తరపున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. గత నెలలో 12 మంది బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులకు సంబంధించిన ఎంపిక ప్రక్రియను టక్ట్ ఇంటర్నేషనల్ మరియు ఆక్సిలా అకాడమీ బృందం విజయవంతంగా పూర్తి చేయడంతో పాటు వారి వీసా ప్రక్రియ చివరి దశకు చేరుకున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే వారు జర్మనీలో నర్సులుగా తమ ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించనున్నట్లు ఆ బృందంలోని సభ్యులు తెలిపారు. ఇప్పటికే నైపుణ్యాభివృద్ధి సంస్థ దీనికి సంబంధించి టక్ట్ ఇంటర్నేషనల్, ఏపీఎన్ఆర్టీఎస్ తో ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం 2 నెలల పాటు రోజుకు 6 గంటల చొప్పున వారానికి 48 గంటలు శిక్షణ ఉంటుందని, శిక్షణ సమయంలో హాస్టల్‌లో ఉండే అభ్యర్థులు హాస్టల్ ఫీజులను వారే చెల్లించుకోవాలన్నారు. అభ్యర్థి తన బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, పాస్ పోర్ట్, అనుభవ ధృవీకరణ పత్రం తప్పనిసరిగా కలిగి ఉండాలి. ఆఫర్ లెటర్ పొందిన అభ్యర్థులకు విమాన ఛార్జీలు ఉచితమని, అలాగే మొదటి 6 నెలలు ఆహారం, వసతి కూడా ఉచితంగా అందిస్తామని వివరించారు. ఈ సమయంలో నెలకు 1,000 యూరోలు (రూ.89వేలు) జీతం కూడా ఇవ్వనున్నట్లు నైపుణ్య శాఖ వివరించింది. ఆసక్తి ఉన్నవారు ఏపీఎస్ఎస్డీసీ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని, నైపుణ్యాభివృద్ధి సంస్థ హెల్ప్‌లైన్ నంబర్ 99888 53335 సంప్రదించాలన్నారు. కేవలం హెల్త్ కేర్ (నర్సింగ్) కు సంబంధించిన ఉద్యోగాలే కాకుండా ఐటీ, హాస్పిటాలిటీ, ప్లాస్టిక్, ఇతర ప్రాధాన్యత రంగాల్లోనూ అవకాశాలను కల్పిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు తెలిపారు.జర్మనీలో 6 నెలలు బీ2 సర్టిఫికేషన్ శిక్షణ ఇస్తారని, బీ2 స్థాయిలో ఉత్తీర్ణత సాధించిన తరువాత నెలకు 2,500 యూరోలు (రూ.2.20 లక్షలు) జీతం కూడా ఇచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

## ఏమి తినాలో.. ఏమి కొనాలో అర్థం కావడం 'లేదు' అని సామాన్యప్రజలు



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలు చూపిస్తు న్నాయి. వీటికి తోడుగా కూరగాయల ధరలు ఇదే బాట పట్టాయి. 'ఏమి తినాలో.. ఏమి కొనాలో అర్థం కావడం 'లేదు' అని సామాన్యప్రజలు చెబుతున్నారు. మార్కెట్లో నాలుగు రోజుల క్రితం ఉన్న కూరగాయల ధరలకు ధరలకు పోల్చితే చాలా వ్యత్యాసం కనబడుతోంది. రూ.20 నుంచి రూ.49కు పెరిగిన కిలో టమోట ప్రస్తుత ధర రూ.100. అదే విధంగా రూ. 85 పలికిన కిలో మిరపకాయల ధర రూ.120, సొరకాయ రూ.10 నుంచి రూ.40కు చేరింది. కిలో చొప్పున దొండ కాయలు రూ.35 నుంచి రూ.70కు, బెండకాయలు రూ.45 నుంచి రూ.60కు, దోసకాయలు రూ.30 నుంచి రూ. 60కు, బీన్స్ రూ.50 నుంచి రూ. 80కు, కాకరకాయ రూ.50 నుంచి రూ.70కు, బంగాళ దుంపలు రూ.30 నుంచి రూ.50 కు, మునక్కాయలు రూ.35 నుంచి రూ.50కు, వంకాయలు రూ.40కు, గోంగూర, తోటకూర ఒక్కొక్క కట్ట రూ.5 నుంచి ప్రస్తుతం రూ.15కు పెరిగింది. ఆఖరుకు ఒక్కో కొత్తిమీర కట్ట రూ. 30గా ఉంది. కోడిగుడ్డు రూ.3 నుంచి రూ.5.50/ 6.00 పలుకుతోంది. ఇక, నాటుకోడి గుడ్డు ధర అయితే వారం రోజుల క్రితం రూ.15 కాగా, ప్రస్తుతం రూ.25. చికెన్ కొందామంటే కిలో రూ.240 చెబుతున్నారు.

# అంబటి స్ఫూర్తి ఆదర్శనీయం



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పోరాడిన గొప్ప నాయకుడు అంబటి ఆంజనేయులు అని వక్తలు కొనియాడారు. జర్నలిజం విలువలను కాడటమే కాకుండా పత్రికా కార్మికుల హక్కుల సాధన కోసం ఆయన పోరాడారని, మానవత్వం మూర్తీభవించిన మహామనిషి అంబటి ఆంజనేయులు అని పేర్కొన్నారు. ఏపీయూడబ్ల్యూజే అధ్వర్యంలో అంబటి ఆంజనేయులు సంస్మరణసభ విజయవాడలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగింది. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ)జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉన్నతభావాలతో అనేకమంది మిత్రులను సంపాదించుకున్న నాయకుడు అంబటి అని గుర్తుచేశారు విజయవాడలో పుల్లయ్య, నండూరు రామ్మోహన్‌రావు, సి.రాఘవాచారి వంటి మహామహులతో కలిసి పనిచేయటంతో పాటు తుదిశ్వాస వరకు జర్నలిస్టు ఉద్యమంలో ఉన్నారన్నారు. ఐజేయూ జాతీయ ప్రధాన కార్యదర్శి బల్వీందర్‌సింగ్ సంధూ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ప్రజావ్యతిరేక విధానాలపై జర్నలిస్టులుగా పోరాటం చేద్దామని నిర్ణయించుకున్నామన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో జర్నలిస్టులకు నాయకత్వం వహించి ఎందరికో ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. ఐజేయూ మాజీ అధ్యక్షుడు ఎస్ఎన్ సిన్హా మాట్లాడుతూ కేవలం జర్నలిస్టుల కోసం మాత్రమే కాకుండా న్యూస్ పేపర్లలో పనిచేసే కార్మికుల సంక్షేమం కోసం అంబటి పని చేశారని చెప్పారు. ఏపీ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ ఉద్యమ నాయకుడుగా అంబటి యాజమాన్యాలు, జర్నలిస్టులు, కార్మికులు మధ్య ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా పోరాటం చేశారన్నారు. ఏఐసీసీ సభ్యులు కేవీపీ రామచంద్రరావు మాట్లాడుతూ నాటితరం నుంచి నేటి వరకు జర్నలిస్టు విలువల్ని కాపాడటంలో అంబటి కృషి చేశారని చెప్పారు.

మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట రామయ్య(నాని) మాట్లాడుతూ ఎంత సంక్లిష్ట సమస్యనైనా మృదువుగా చెప్పటంలో అంబటి దిట్ట అన్నారు. విజయవాడలో పేపర్ ఉన్నంత కాలం అంబటిపేరు చిరస్థాయిగా ఉంటుందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ జర్నలిస్టులు, కార్మికుల కోసం నిస్వార్థంగా పని చేశారన్నారు. ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ 60 ఏళ్లుగా జర్నలిస్టుల సంక్షేమం కోసం అంబటి చేసిన కృషిని వివరించారు. ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్ మాట్లాడుతూ అంబటి ఆంజనేయులు కుటుంబానికి యూనియన్ అండగా ఉంటుందన్నారు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లోని ప్రధాన సమావేశం మందిరానికి అంబటి ఆంజనేయులు హాల్‌గా నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ కార్యదర్శి డి.సోమసుందర్, కార్యవర్గ సభ్యుడు ఆలపాటి సురేశ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు అంబటి సుబ్బారావు, సీపీఎం రాష్ట్ర నాయకులు దోనేపూడి కాశీనాథ్, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ కస్తూరి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నిమ్మరాజు చలపతిరావు, సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, ఏపీయూడబ్ల్యూజే కృష్ణాజిల్లా కార్యదర్శి కొండా రాజేశ్వరరావు, అంబటి ఆంజనేయులు కుమారులు అంబటి సంజయ్‌కుమార్, సంతోశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. సీనియర్ పాత్రికేయులు రాజశేఖర్ ఫోన్ ద్వారా నివాళులర్పించారు. వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, జర్నలిస్టు సంఘాల నాయకులు, అంబటి ఆంజనేయులు మిత్రులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed, Published and Owned by KONDURI SRINIVASARAO, Printed at M/s Arunodaya Note Book Manufacturers Pvt Ltd, D.NO: 33-5-5 Papaiah Street, Seethurampuram, VIJAYAWADA, Krishna District , Andhra Pradesh and Published From H.No: 24-9/1-148, Ramanagar, Ramakoti Maidanam, Bavajipeta 1st Line cross, VIJAYAWADA Krishna District Andhra Pradesh.
Editor Konduri Srinivasarao, RNI Title APTEL/2021/80559, Phone :9948877444, Email id: konduri9999@gmail.com